క్లుప్తంగా

ఏకలవ్యుడి విగ్రహ ఏర్పాటుకు వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఏకలవ్యుడి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎరుకుల సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన తప్పకుండా విగ్రహానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్



పెద్దతుంబళంలో అనుమానితులను విచారిస్తున్న సీఐ, ఎస్ఐ

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం, కుప్పగల్ గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. పెద్దతుంబళం గ్రామానికి చెందిన నరసయ్య, తిక్కయ్య ఇళ్లల్లో 102 ప్యాకెట్ల(90 ఎంఎల్) కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని చెప్పారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డెన్‌సెర్చ్‌లో ఎస్ఐలు పీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో మాధవరం ఎస్ఐ

మంత్రాలయం: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన మైనుద్దీన్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మద్యం, నిందితుడి అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై 5 బాక్సుల్లో తీసుకొస్తున్న 90ఎంఎల్ 480 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వగరూరు గ్రామానికి చెందిన మైనుద్దీన్‌పై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో పోలీసులు వీరాంజినేయులు, భాస్కర్, సెబ్ హెచ్‌సీ షరీఫ్ పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు



దేవరగట్టులో పూజలు నిర్వహిస్తున్న పూజారి

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.

గ్రానెట్ స్లాబ్స్ లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్రకాశం జిల్లా బూదగోడ నుంచి గోవాకు గెలాక్సీ గ్రానెట్ స్లాబ్స్‌ను రాయల్టీ రవాణా పత్రాల్లో అనుమతించిన పరిమాణం కంటే అత్యధికంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. గ్రానెట్ స్లాబ్స్‌ను అనుమతులకు మించి లారీలో తరలిస్తున్నారనే సమాచారంతో ఆదివారం తెల్లవారు జామున ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఆకస్మికంగా దాడి చేశారు. లారీని సీజ్ చేసి రూ.1,01,100 అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి ఘనంగా నిర్వహిద్దాం

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 20న జరుపుకోబోయే భీష్మ ఏకాదశి కార్యక్రమాలను విజయవంతం చేద్దామని గంగపుత్ర (బెస్త) సంఘం ప్రతినిధి అనకల బాలాజీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గంగమ్మ గుడి ఆలయ ప్రాంగణంలో సంఘం మండల సమావేశం జరిగింది. మండలంలోని గంగపుత్రుల సమస్యలపై చర్చించారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల గంగపుత్రులను కలుపుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేలా తీర్మానించారు. సమావేశంలో కోదండ, రమేష్, రమణాచలం, పాల్గొన్నారు.

రైతు 'భరోసా' కేంద్రాలు

- గ్రామాల్లోనే రైతులకు అన్ని రకాల సేవలు
- విత్తు నుంచి పంట విక్రయం వరకు చేదోడు
- పంట సాగుపై ఎప్పటికప్పుడు అవగాహన
- సకాలంలో రాయితీపై ఎరువులు, విత్తనాలు సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ఆరేకల్‌లో రైతు భరోసా కేంద్రం

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోంది. రైతులకు గ్రామాల్లోనే అన్ని రకాల సేవలను అందించాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. విత్తు నాటడం నుంచి పంటను విక్రయించుకునే వరకు రైతులకు చేయూతనిస్తోంది. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. గంటల తరబడి క్యూలో వేచి ఉండి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ సమస్యలన్నంటికీ ముగింపు పలికారు. ఆయా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులోనే రైతులకు విత్తనాలు, రాయితీపై ఎరువులు, వ్యవసాయ పరికరాలు,



పంట బీమా సహా అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. పంట సాగులో సందేహాలు ఉంటే వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో వచ్చి మెలకువలు చెబుతున్నారు. ఆదోని మండలంలో మొత్తం 35 ఆర్బీకేలు సేవలందిస్తున్నాయి. ఇందులో 23 శాశ్వత భవనాలు ఉండగా మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

ఆర్బీకేలతో రైతులకు ఎన్నో ఉపయోగాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు అన్ని రకాల సమాచారం, ఆన్‌లైన్‌లో పంట నమోదు, వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ ధరలు, ఆధునిక సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం తెలుసుకోవచ్చు. అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసుకోవచ్చు. బ్యాంకు లావాదేవీలు చూసుకోవచ్చు. ఈ-పంట నమోదు, కౌలుకార్డులు పొందవచ్చు. విత్తనాల రాయితీ, రైతుభరోసాకు సంబంధించి నగదు జమకాని రైతుల సమస్యలను కూడా పరిష్కరించుకోవచ్చు. పంట మద్దతు ధరతో పాటు సాగు విషయాలను కేంద్రంలోని పుస్తకాల ద్వారా తెలుసుకోవచ్చు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ అధికారుల సందేశాన్ని టీవీల ద్వారా లైవ్‌లో చూడవచ్చు. గతంలో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం వ్యయప్రయాసాలతో పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడేవాళ్లమని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానికంగానే అన్నిరకాల సేవలను కల్పించడం సంతోషంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

సద్వినియోగం చేసుకోండి



రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలను అందిస్తోంది. మా సిబ్బంది, నేను పర్యవేక్షిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను, వ్యవసాయ పరికరాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సబ్సిడీ ద్వారా ఎరువులు, విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చూస్తున్నాం. రైతులు ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
–అశోక్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

స్థానికంగా అన్ని రకాల సేవలు



గతంలో సబ్సిడీ ఎరువులు, విత్తనాల కోసం ఆదోని పట్టణంలోని మండల అగ్రికల్చర్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండి సబ్సిడీ ఎరువులు, విత్తనాలు పొందేవాళ్లం. నేడు ఆ పరిస్థితి లేదు. స్థానికంగానే గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందాను. దీని వల్ల దాదాపు రూ.50 వేల వరకు ఖర్చు తగ్గింది. రైతు భరోసా, పీఎం కిసాన్, క్రాప్ ఇన్సూరెన్స్, క్రాప్ బుకింగ్ వంటివి ఉన్న చోటే లబ్ధి పొందాను.– బంగి నీలకంఠ, రైతు, నారాయణపురం

ఇది రైతు ప్రభుత్వం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఇన్ని సౌకర్యాలు కల్పించడం సంతోషంగా ఉంది. ఇది రైతు ప్రభుత్వమని రైతులు భావిస్తున్నారు. ఉన్నచోటే అన్ని రకాల సౌకర్యాలు పొందుతున్నాం. పంటలకు గిట్టుబాటు ధర, రైతుభరోసా నగదు జమ, పీఎం కిసాన్ డబ్బులు అందజేతతో లబ్ధిపొందుతున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నాం.
–తిమ్మప్ప, రైతు, నాగనాథనహళ్లి

ఎంఈఓ సేవలు మరువలేనివి





ఎంఈఓ శివరాములు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, హాజరైన ఉపాధ్యాయులు

ఆదోనిసెంట్రల్: ఎంఈఓ శివరాములు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలోని జె.బి.గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎంఈఓ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి హాజరై ఎంఈఓ దంపతులకు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో విద్యాభివృద్ధికి ఎంఈఓ చేసిన సేవలు అమోఘమన్నారు. విధి నిర్వహణలో నిజాయితీగా ఉంటూ అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు, అధికారులను కలుపుకునిపోతూ ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్క విద్యార్థికి అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శాంత, ఎస్టీయూ నాయకులు నాగరాజు, రమేష్‌నాయుడు, చంద్ర, శాంతి, బీటీఏ నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



వగరూరులో హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత వైద్య రంగానికి పెద్దపీట వేయడం ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యపడిందని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వగరూరు గ్రామంలో రూ.17.05 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటరును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ పథకంలో మరిన్ని వ్యాధుల సంఖ్య పెంచి పేదలకు ఎంతో మేలు చేశారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే డాక్టర్లను తీసుకురావడం హర్షనీయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో, పట్టణాల్లో రోగులను గుర్తించడం మెచ్చుకోదగ్గ విషయమన్నారు. 108, 104 అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజల వద్దకే తీసుకెళ్లడం అభినందనీయమని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోని వైద్య వ్యవస్థ మన రాష్ట్రంలో ఉండడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై జగనన్నకు ఉన్న ఆసక్తి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, పీఆర్ ఏఈ నరసింహులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి



కోసిగి సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పొందిన ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ రుద్రగౌడ, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ ఆరూన్ రషీద్ తెలిపారు. ఆదివారం కోసిగి మండలంలోని 19 సచివాలయాల్లో ఇళ్ల పట్టాలు పొందిన పత్రాలను శాశ్వతంగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోసిగి మండలంలోని 26 గ్రామాలకు గాను జగనన్న కాలనీల్లో 2027 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి పట్టాలను పంపిణీ చేసిందన్నారు. పట్టాలు పొందిన వారికి శాశ్వత హక్కు కలిగేలా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు సచివాలయాల్లో 300 వరకు పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారితో పాటు వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్

కౌతాళం: మండల కేంద్రానికి చెందిన వలంటీర్ మహబూబ్ కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేశాడు. గ్రామానికి చెందిన చాకలి లక్ష్మి బెంగళూరుకు వలస వెళ్లింది. అనారోగ్యానికి గురికావడంతో అక్కడే ఆపరేషన్ చేయించుకుంది. పింఛన్ కోసం ఇక్కడికి రాలేని పరిస్థితిలో వలంటీర్ మహబూబ్ బెంగళూరుకు వెళ్లి రూ. 3 వేల పింఛన్ అందించాడు. అలాగే వైఎస్సార్ చేయూతకు సంబంధించి తంబ్ (ఈకేవైసీ)ని కూడా తీసుకున్నాడు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్



దత్తస్వామికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ఆదోనిటౌన్: ఆదోని పట్టణం ఒకటో వార్డులోని వాల్మీకినగర్ మంగరాయ కాలనీకి చెందిన చింతపల్లి ప్రహ్లాదరావు అనారోగ్యంతో తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఫయాజ్‌బాషా ఆదివారం తాడిపత్రికి వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.3 వేలను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అదేవిధంగా 2వ వార్డులో మంచం పట్టిన మైమున్నీసాబేగంకు (83) వలంటీర్ పరశురామ్ పింఛన్‌ను అందజేశారు. దీనిపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో తామున్న చోటుకే పింఛన్లను అందజేస్తున్నారని, ఇలాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదని, తమ మద్దతు జగనన్నకే అని చెప్పారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి



బీసీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఏవీఎఫ్ నాయకులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు నాలుగు నెలలుగా గుడ్డును అందించకుండా మాయం చేసిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. ఆర్‌ఏవీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను ఇక్కడ వదిలితే హాస్టల్ వార్డెన్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నాలుగు నెలలుగా విద్యార్థులకు గుడ్డును కూడా పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. వార్డెన్ ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి బిల్లు రాలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాల్మీకుల హక్కుల కోసం ఉద్యమిద్దాం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నేతలు

ఆదోనిరూరల్: పార్టీలకు అతీతంగా వాల్మీకి హక్కుల కోసం ఉద్యమించాలని వాల్మీకుల న్యాయ మహాపాదయాత్ర సాధన కమిటీ కన్వీనర్ ఎస్.పరమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వాల్మీకులతో సమావేశమయ్యారు. ఈనెల 8వ తేదీ వాల్మీకి మహా న్యాయ పాదయాత్రను జయప్రదం చేయాలని మదిరె, పెద్ద హరివాణం, సంతెకూడ్లూరు, చిన్నహరివాణం, చిన్నగోనెహాల్ గ్రామాల్లో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చుతామని కల్లిబొల్లి మాటలు చెబుతూ అధికార పీఠం ఎక్కుతారన్నారు. వాల్మీకుల ఎస్టీ సాధనకై పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకులు సీతారామయ్య, ఉషారాజ్, ఆరేకల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ సరికాదు



నారాయణ కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

ఆదోనిసెంట్రల్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, బాలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలను మూసివేయించారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను కోరారు. విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని, వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి నాయకులు విష్ణునాయుడు, హరిక్రిష్ణ, మహేష్, హోసన్నా, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక తరగతులు


- పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ప్రత్యేక దృష్టి సారించిన ఉపాధ్యాయులు



ప్రత్యేక క్లాసుల్లో చదువుకుంటున్న విద్యార్థులు


కౌతాళం: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతుల్ని నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రతి సబ్జెక్ట్ అర్థం అయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు కౌతాళం జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పాఠశాల అనంతరం సాయంత్రం 6.30 గంటలకు వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టుపై ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తున్నారు. వారికి మార్గదర్శకం చేస్తున్నారు. పాఠశాలలో 230 మంది పదో తరగతి చదువుతున్నారు. ఇందులో ఇంగ్లిష్ మీడియంలో 84 మంది, కన్నడ మీడియంలో 26 మంది విద్యను అభ్యసిస్తుండగా తెలుగు మీడియంలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని వందశాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో ఉందని.. దానికి తమ వంతుగా విద్యార్థులకు అర్థం అయ్యేలా సులభ పద్ధతిలో బోధన చేస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియల్ తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల కోసం ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు రీడింగ్ క్లాస్‌లు నిర్వహిస్తున్నామని.. అనంతరం 8 నుంచి 9 గంటల వరకు పరీక్ష పెడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి 6.30 గంటల వరకు క్లాసులతో పాటు టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో మంచి ఫలితాలను సాధించాలన్న కారణంగా ఈ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న చెక్కీలను స్నాక్స్ కింద ఇస్తున్నట్లు తెలిపారు.

ఎంతో ఉపయోగపడుతోంది




ప్రత్యేక క్లాసులు ఎంతగానో ఉపయోగపడుతోంది. పాఠశాల నుంచి ఇంటికి పోతే చదువుకోలేమని ఉపాధ్యాయులు ఉదయం గంటన్నర, సాయంత్రం రెండున్నర గంటలు ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నారు. చదువుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు పరీక్షలు రాస్తున్నాం. తెలియని విషయాలను ఉపాధ్యాయులు అడిగి తెలుసుకుంటున్నాం. –నాగరత్న, విద్యార్థిని

ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది




ప్రత్యేక తరగతుల వల్ల ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది. క్లాస్‌లో అర్థం కాని విషయాలను ఇక్కడ చెబుతాం. ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఆరున్నర గంటల తర్వాతే ఇళ్లకు వెళుతున్నారు. ప్రతి విషయాన్ని విద్యార్థులకు అర్థం అయ్యేలా చెప్పాలన్న ఉద్దేశంతోనే ఈ క్లాసులు నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నాం.
–ఇమ్మానియాల్ ప్రధానోపాధ్యాయుడు

క్లాస్‌లో అర్థం కాని విషయాలను తెలుసుకుంటున్నాం



క్లాసు రూంలో అర్థం కాని విషయాలను ప్రత్యేక తరగతుల్లో తెలుసుకుంటున్నాం. ఉపాధ్యాయులు ప్రతి డౌట్‌ను క్లియర్ చేస్తున్నారు. అర్థం కాని విషయాన్ని సులభ పద్ధతిలో చెబుతుండడంతో త్వరగా నేర్చుకుంటున్నాం. తరగతిలో తెలుసుకున్న విషయాలను మరోసారి మననం చేసుకోవడం వల్ల బాగా గుర్తుండిపోతోంది. పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం పెరిగింది.
–విక్రమ్, పదో తరగతి విద్యార్థి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతి చెందిన నరసింహగౌడ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన రైతు ఈ.నరసింహగౌడ్ (39) అప్పుల బాధతో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఈ.నరసింహగౌడ్‌కు భార్య రామలక్ష్మి, కుమార్తె లీలావతి, కుమారుడు భరత్ ఉన్నారు. తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పొలం పనులు, ఇంటి కోసం రూ.6 లక్షలకు పైగా అప్పు చేశాడు. పంట నష్టం రావడం, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఇనుప కడ్డీకి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవటంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా తాడుకు వేలాడుతూ కనిపించడంతో ఇంటి పక్కల వారు వచ్చి కిందకు దించారు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సాయంత్రం తెలిపారు.

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున అష్టవిధ మహా మంగళ హారతుల సేవల నుంచి శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనం ప్రారంభమైంది. సెలవురోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు, శివదీక్షా స్వాములు ఆలయానికి చేరుకున్నారు. ఈ మేరకు వారు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. శివదీక్షా స్వాములు భజనలు చేస్తూ పూజలు జరిపారు.

శ్రీశైలంలో భారీ కొండచిలువ



కొండచిలువను అడవిలోకి వదులుతున్న దృశ్యం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని దేవస్థానం చండీశ్వర సదన్ అతిథి గృహం సమీపం నుంచి స్టాఫ్ క్వార్టర్స్ దగ్గర ఉన్న బాలగణేష్ వనంలోకి వెళ్తున్న భారీ కొండచిలువను శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. కొండచిలువ రోడ్డు దాటుతున్న సమయంలో యాత్రికులు గమనించి స్థానికులకు చూపించడంతో పాములను పట్టుకోవడంలో నైపుణ్యం కలిగిన స్నేక్‌రాజా అక్కడికి చేరుకొని దానిని పట్టుకున్నాడు. అనంతరం 9అడుగుల కొండచిలువను మల్లమ్మ కన్నీరు ఆలయ సమీపంలో అడవిలో వదిలారు.